


గణపయ్య బ్రహ్మోత్సవాలకు

# సర్వం సిద్ధం

**-వేకువ జామున 3 గంటల నుండే దర్శనం**
**-నేడు స్వామివారికి మంత్రి పట్టు వస్త్రాల సమర్పణ**



కాణిపాకం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం సర్వం సన్నద్ధమైంది. కాణిపాకం దేవస్థానంలో శనివారం నుండి ఈనెల 27 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఆలయంను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు వివిధ రకాల విదేశీ, స్వదేశీ జాతీ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఇందులో భాగంగా ఆస్వేటి మండపం, సుపథ మండపంలలో రంగవల్లికలను అందంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల సందర్భంగా భక్తులందరికి త్వరితగతిన దర్శనం కల్పించేందుకు వీలుగా సామాన్య భక్తులతో పాటు విఐపీలకు, చంటిబిడ్డల తల్లులకు, వికలాంగులకు, ఉభయదారులకు ఆలయం వద్ద వేర్వేరుగా ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులందరికి స్వామివారి ప్రసాదాలు అందించేందుకు కావలసిన లడ్డూ, ప్రసాదాలను సిద్ధం చేసి వుంచారు. వినాయక చవితి సందర్భంగా ఉభయదారులచే శనివారం వేకువజామున స్వామివారికి ప్రత్యేకఅభిషేకం అనంతరం 3గంటల నుండి భక్తులకు ఆలయంలో స్వామివారి దర్శనం కల్పించనున్నారు. దేవస్థానం ఈఓ పట్టెం గురుప్రసాద్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. స్వామివారికి ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి రాంనారాయణరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

**ఏర్పాట్లును పరిశీలించిన ఈఓ**

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద చేపట్టిన ఏర్పాట్లును ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. లట్టూపోటులో లడ్డూల నాణ్యత, పడితరం స్టోర్, అన్నదానం,కళ్యాణకట్ట, తదితర ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ప్రధాన ఆలయంలో ధ్వజస్థంభం వద్ద పందిరి కొయ్యకు ప్రత్యేకపూజలు చేసి కొయ్యను ప్రతిష్టించారు.

**244 మందితో బందోబస్తు : చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు**

కాణిపాకం స్వామివారి బ్రహ్మోత్సవాలకు 244 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీదర్‌నాయుడు చిత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి కాణిపాకంలో బ్రహ్మోత్సవ విధులను కేటాయించారు. అనంతరం ఆయన 'ప్రభాత వార్త' తో మాట్లాడుతూ ఇద్దరు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలతో పాటు ఏఎస్సైలు,హెడ్‌కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కార్మికునిపై కత్తితో దాడి

తిరుమల,సెప్టెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి: ఇద్దరి మధ్య ఆర్థికలావాదేవీల కారణంగా కార్మికుడిపై కత్తితో దాడిచేశాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం తిరుమల కౌస్తుభం విశ్రాంతి భవనం వద్ద జరిగింది. కదిరికి చెందిన నరసింహా,రాయచోటికి చెందిన ఉదయకిరణ్ ఇద్దరూ భవననిర్మాణ పనులు చేసుకుంటున్నారు. ఇద్దరూ కౌస్తుభం వద్ద డబ్బుల విషయంగా గోడవపడ్డారు. మాటామాటా పెరగడంతో నరసింహాను కత్తితో ఉదయ్ దాడిచేశాడు, వెంటనే స్థానిక సెక్యూరిటీ అశ్వనీకి తరలించారు. తిరుమల 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# వైద్య సేవలు దారుణం

- **రూ.కోట్లు ఖర్చు చేసినా పరిష్కారం కాని మంచినీటి సమస్య**
- **రీచ్‌ల నుండి మాత్రమే ఇసుక రవాణా**
- **వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇళ్ళ నిర్మాణాలు పూర్తికి చర్యలు**
- **జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ధ్వజం**





చిత్తూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: జిల్లాలో గ్రామీణ వైద్యం పడకేసిందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు దారుణంగా వున్నాయని ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య పరిష్కారం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి బోర్లు డ్రిల్ చేస్తున్నారని అయితే ఇప్పటికీ గ్రామాల్లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించని పరిస్థితులు నెలకొన్నాయని ఎమ్మెల్యేలు ఆరోపించారు. జడ్పీ సమావేశభవనంలో శుక్రవారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్యేలు పులివర్తినాని, డాక్టర్ కలికిరి మురళీమోహన్, డాక్టర్ థామస్, ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, చంద్రశఖ్హర్‌రెడ్డిలు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జడ్పీ సిఇఓ గ్లోరియా, తిరుపతి డిఆర్ఓ పెంచల కిషోర్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ జిల్లాలోని పిహెచ్‌సిల్లో జనరల్ డాక్టర్లు అందుబాటులో లేని పరిస్థితి నెలకొందని, తాను పెనుమూరు పిహెచ్‌సిని అకస్మికంగా ఇటీవల తనిఖీ చేస్తే బిడిఎస్ చేసిన డాక్టర్లు జనరల్ డాక్టర్లుగా రోగులకు వైద్యం అందిస్తున్నారని, ఇంతకంటే దారుణం ఎదైనా వుందా! అని నిలదీశారు. పిహెచ్‌సిల్లో ఇద్దరు డాక్టర్లు వుండాలని, ఇందులో ఒక డాక్టర్ క్షేత్ర స్థాయికి వెళ్ళి ప్రజలకు వైద్యం అందస్తే మరొక డాక్టర్ పిహెచ్‌సిలో వుండి రోగులకు వైద్యం అందించాలన్నారు. అయితే పలు పిహెచ్‌సిల్లో ఒకొక్క డాక్టర్ మాత్రమే వుండటంతో రోగులకు సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొందన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా శాఖ పల్లెల్లో మంచినీటి సమస్య పరిష్కారం కోసం ఎక్కడ పడితే అక్కడ బోర్లు డ్రిల్ చేసినట్లు నివేదికల్లో చూపుతుందని, అయితే ఇప్పటి వరకు వేసిన బోర్లు ఉపయోగంలోకి వచ్చాయా! లేదా! అనేది తేలాల్సి వుందన్నారు. తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పింక్ బస్సు ద్వారా ప్రాథమికంగా పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అనంతరం దాని నుండి బయట పడటానికి పూర్తి వైద్యసేవలు అందించాల్సి వుందని కోరారు. దీనిపై తిరుపతి డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ చేసిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతున్నదన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి అవాస్ యోజనలో భాగంగా వంద రోజుల ప్రణాళికలో ఇళ్ళ నిర్మాణాల పూర్తికి చేపడుతున్నామన్నారు. జిల్లాలో నూతన ఇసుక విధానం-2024ను పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 101 పిహెచ్‌సిల్లో ఇద్దరు డాక్టర్లు విధుల్లో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పులివర్తినాని మాట్లా డుతూ పాకాల ప్రభుత్వ ఆసుపత్రికి 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని, చిన్నసమస్య వచ్చినా పి.కొత్తకోట కువెళ్ళాల్సి నపరిస్థితి వుందన్నారు.

## భక్తుల నుదుటిన తిరునామం



తిరుమల,సెప్టెంబర్ 6 ప్రభాతవార్తప్రతినిధి: గోవింద అనే నినాదంతో తిరుమలకు వస్తున్న భక్తులు పవిత్రంగా ,భక్తితో తిరునామం తిలకధారణ చేసుకోవాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కోరారు. శుక్రవారం సాయంత్రం తిరుమలలో ఏటిసి కూడలి వద్ద క్యూలైన్‌లలోకి చేరుకునే భక్తులకు శ్రీవారిసేవకులు తిరునామధారణ చేయించారు. తిరుమలలో ఏటిసి, సుపథం, వరాహస్వామి ఆలయం,కల్యాణకట్ట, వైకుంఠమ్ క్యూలైన్ల వద్ద నిరంతరాయంగా తిలకధారణ చేస్తారు.












# నాణ్యతగా ప్రసాదాలు

**అలిపిరి కాలినడక మార్గంలో దివ్యదర్శనం టోకెన్లు పునరుద్ధరణ**
**'డయల్ యువర్ ఈఓ''లో శ్యామలరావు**



తిరుమల,సెప్టెంబర్ 6 ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వచ్చే భక్తులకు నాణ్యతతో అన్నప్రసాదాలు, లడ్డూలు తయారీచేసి అందించేందుకు చర్యలు తీసుకున్నామని టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటల ఉత్పత్తులు, ఆవునెయ్యితో ప్రసాదాల తయారీ జరుగుతుందన్నారు. శుక్రవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో జరిగిన "డయల్ యువర్ ఈఓ"కార్యక్రమం జరిగింది. అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం,సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమతో కలసి ఈఓ జె.శ్యామలరావు మాట్లాడారు. దేవుని బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది అక్టోబర్ 4వతేదీ నుండి 12వరకు అంగరంగవైభవంగా నిర్వహించనున్నామని చెప్పారు. కాలినడకన తిరుమలకు వచ్చే భక్తులకు అలిపిరి పాదాలమండపం వద్ద దివ్యదర్శనం టోకెన్లు జారీ చేసే కౌంటర్లు, గాలిగోపురం వద్ద స్కానింగ్ కౌంటర్లను త్వరలో పున:ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రసాదాల నాణ్యత పాటించేందుకు ఆవునెయ్యి వినియోగిస్తున్నామని, అన్నప్రసాదాలు నాణ్యత పెంచామన్నారు.

ఎమ్మెల్యే కోనేటి యవ్వారం

# టిడిపిలో కలకలం !!

**-పలువురు నేతల్లో అంతర్మధనం**



ప్రభాతవార్త-తిరుపతి: సమాజంలో హుందాగా...బాధ్యతతో ,ఆదర్శంగా ఉంటూ ప్రజాసేవకు అంకితమవ్వాల్సిన ప్రజాప్రతినిధి రాసలీలల బాగోతంలో అడ్డంగా బుక్ అవ్వడం ఇప్పుడు జనంలో చర్చనీయాంశంగా మారింది. నిన్నగాక మొన్న తెలుగుదేశం పార్టీలోకి వలస వచ్చిన ఆ నేత యవ్వారంతో మూడు, నాలుగుదశాబ్ధాల అనుభవం, సీనియార్టీ ఉన్న తెలుగుతేశం నేతలు అంతర్మథనం చెందుతున్నారు. అసలు రాజకీయంగా ఇది పెద్దదుమారాన్ని రేపుతోంది. ఇప్పటికే పార్టీ అధిష్టానం ఆయనను సస్పెండ్ చేసింది. ఇప్పటివరకు ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని 14 నియోజకవర్గాల్లోగానీ, విభజిత తిరుపతి జిల్లాలోగానీ ప్రజాప్రతినిధుల రాసలీలల వ్యవహారం వెలుగుచూడలేదు. ఇప్పుడు గత సార్వత్రిక ఎన్నికల ముందు వైసిపి నుండి టిడిపికి వచ్చి కండువా మార్చుకున్న నేత సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఏకంగా టిడిపి మహిళ నేతతో అసభ్యంగా ప్రవర్తించడం, లైంగికంగా వేధించి తనపై అఘాయిత్యానికి పాల్పడ్డాడంటూ పోలీసులను ఆశ్రయించడంతో కాస్త తీవ్రమైంది. దీనిపై ఇప్పటికే తిరుపతి ఈస్టుపోలీసుస్టేషన్‌లో క్రైమ్ నంబర్ 430/2024 కేసు నమోదుకావడం మరింత సంచలనంగా మారింది. సెక్సువల్ వేధింపులకు గురిచేసి,శారీరకంగా అనుభవించి తనపై అఘాయిత్యం చేశాడని బాధిత మహిళ ఫిర్యాదుపై తిరుపతి ఈస్టు సిఐ మహేశ్వర్‌రెడ్డి కేసు విచారణ దిశగా అడుగులేస్తున్నారు. ఆయనపై కేసు నమోదు కావడంతో శుక్రవారం ఉదయం ఒక్కసారిగా తీవ్రమైన గుండెపోటుకు గురవడంతో కుటుంబసభ్యులు చెన్నై అపోలో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.బాధిత మహిళ ఆరోపణలు మేరకు తిరుపతిలో వీళ్ళు బసచేసిన ఆ హోటల్‌ను తనిఖీచేసిన ఈస్టు డిఎస్పీ వెంకటనారాయణ, ఈస్టు సిఐ మహేశ్వరరెడ్డి తదుపరి సిసిటివి పుటేజీలు కూడా సేకరించారు. ఈ కేసులో ఆయన ఎమ్మెల్యేగా కూడా రాజీనామా చేసే అవకాశాలు లేకపోలేదని పార్టీ నేతలు చెబుతున్నారు. మరోవైపు టిడిపి నేతలే తనపై అసత్యఆరోపణలతో ఇలా ఇరికించారని ఆదిమూలం ప్రతిస్పందించిన విషయం తెలిసిందే. మరీ ఆధారాలు లభించడంతో ఇప్పుడు ముందుముందు ఎక్కడకు దారితీస్తుందోనని పార్టీలో సంచలనంగా మారింది. మరీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో సొంత పార్టీ ఎమ్మెల్యే ఇలా బుక్కవ్వడం దారితీసే పరిస్థితులు కాలమే సమాధానం చెబుతుందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

ఓ బొజ్జగణపయ్య..

# నీ బంటు నేనయ్య..

**-నేడు వినాయకచవితి**





శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 6 ప్రభాతవార్త హిందువులకు మొదటి పండగ వినాయక చవితి. సాధారణంగా గ్రామాల్లో 'పిళ్ళారి చవితి పండగల్ని పిల్చుకొని వస్తుంది. ఉగాది ఊడ్చుకొని పోతుందని' చెబుతారు. ఈ ఏడాది నేడు శనివారం వినాయక చవితి జరుపుకోబోతున్నారు. అయితే ప్రతి రోజు రాత్రి ఓ మోస్తారు వర్షం పడడంతో వినాయకవిగ్రహాల వ్యాపారులు ఆందోళన చెందినా వరుణుడు కరుణించడంతో కాస్త వ్యాపారాలు ఓ మోస్తరుగా సాగాయి. పట్టణంలోని చెన్నైరోడ్డులోని ధర్మరాజులగుడి ప్రాంగణంలోను, మిట్టకండ్రిగ, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో భారీ వినాయక విగ్రహాలు తయారు చేసినా అమ్మకాలు సాగకూడదని ప్రకటించటంతో సాగిల పడ్డారు. మట్టి బొమ్మలకే పరిమితమయ్యారు. భారీ విగ్రహాల ఏర్పాటు ఎక్కడా కనబడలేదు.. జై భోళో..గణేష్ మహారాజ్‌కీ..జై అంటూ చిన్నా..పెద్దా.. తేడా లేకుండా తలకు రిబ్బన్లు కట్టుకుని సందడిచేయడం కనిపించింది. కాగా చవితి పండుగ సందర్భంగా పట్టణంలోపూల ధరలకు రెక్కలొచ్చాయి. భక్తిశ్రద్దలతో వినాయకచవితి పండుగను నిర్వహించుకునేందుకు జనం సన్నాహాలు చేసుకున్నారు.

## మార్కెట్‌లో కొనుగోలు దారుల సందడి



పుత్తూరురూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో వినాయక చవితి సందర్భంగా మార్కెట్‌లో కొనుగోలు దారులు అధికమయ్యారు. వినాయక చవితిపూజ సామగ్రిని కొనడానికి పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారు. పూలు, పండ్లు, ధరలు ఆకాశాన్ని అంటాయి. అలాగే చిన్న చిన్న అరటి చెట్లు, చెరకు గడలు రేట్లు కూడా ఆకాశాన్ని అంటాయి. సంవత్సరంలో వినాయక చవితి ఉత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో వినాయక మండపాలు గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం అధికమైంది.




## గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసును చేధించిన పాకాల పోలీసులు



పాకాల, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త ఉప్పరపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద హత్య చేసిన వ్యక్తిని పాకాల సిఐ కె. మద్దయ్యాచారి అరెస్టు చేసారు. చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పాకాల సిఐ కె. మద్దయ్యాచారి శుక్రవారం పాకాల పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాకాల సిఐ కె. మద్దయ్యాచారి మాట్లాడుతూ జిల్లా ఎస్పి సుబ్బరాయుడు, చంద్రగిరి డిఎస్పి నర్సింగప్పలు గత మూడు నెలల కిందట పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసుకు సంబంధించిన దిశ నిర్దేశము మేరకు సిబ్బందితో గురువారం కలిసి ఉప్పరపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ఓ వ్యక్తి తిరుగుతుండగా విచారించి అరెస్టు చేయడం జరిగిందని పేర్కొన్నారు. డి. చంద్రశేఖర్ (32), తండ్రి దొరై, భాస్కర్, రాజీవ్ కాలనీ, దామలచెరువు, పాకాల మండలం చెందిన వ్యక్తిగా గుర్తించామని అన్నారు. చంద్రశేఖర్ జులాయిగా తిరుగుతూ మోటార్ సైకిల్ దొంగలించే మదనపల్లికి చెందిన శవాల భాస్కరయ్య కొడుకు సూర్యప్రకాష్ అలియాస్ రాఘవతో స్నేహం ఏర్పరచుకొని తిరిగేవాడు. ఇతను మందుకు అలవాటు పడి భార్య పిల్లలకు దూరమై దేశ దిమ్మరిగా తిరుగుతుండేవాడని 2024 సంవత్సరం జూన్ 11వ తేదీ సూర్య ప్రకాష్ చంద్రశేఖర్లు మందు తాగి వెంకట్రాయని చెరువు వద్ద గల బావిలో స్నానం చేసిన తర్వాత మూడు వేల రూపాయిలు అప్పు కొరకు గొడవ పడుతుండగా సూర్యప్రకాష్ బీరు బాటిల్‌తో చంద్రశేఖర్ పై దాడి చేశాడు. కోపోద్రికుడైన చంద్రశేఖర్ తప్పించుకుని అక్కడ ఉన్న ఇటుక రాళ్లతో కొట్టి, కిందపడిన సూర్య ప్రకాష్ లేస్తే తనను చంపుతాడని పెద్దరాయితో తలపై మోదీ హత్య చేశాడని చెప్పారు. చనిపోయిన సూర్యప్రకాష్ పై గతంలో తిరుపతిలో మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులు ఉన్నాయని, అలాగే మదనపల్లిలో తన తండ్రిపై హత్యాయత్నం చేసిన కేసు ఉన్నదని పేర్కొన్నారు. హత్య చేసిన ముద్దాయిని రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పాకాల ఎస్ఐ మహేష్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**పాలసముద్రం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసి విగ్రహాలకు అనుమతి తప్పనిసరి అని ఎంపిడిఓ రామనాథరెడ్డి, ఎస్ఐ భారతిలు పేర్కొన్నారు. పోలీసు శాఖ జిఎంఎస్‌కెల ద్వారా గ్రామ సచివాలయా పరిధిలోని గ్రామాల్లో నిర్వహించే గణేష్ మహోత్సవంలను ప్రభుత్వం విడుదల చేసిన యాప్‌లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. మట్టి విగ్రహాలతోనే వినాయక చవితి పండుగను ప్రతి ఒక్కరు ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండి వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, విగ్రహాలు ఏర్పాటు చేసిన పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని, అలాగే విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలని, రాత్రి 9.45 గంటలకు పైబడి ఎలాంటి మైకులు పెట్టరాదని ఆయన స్పష్టం చేశారు. నిమ్మజనం జరిగే విషయంను స్థానిక ఎస్‌హెచ్‌ఓకు ముందుగానే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్నానని నిరూపించే దమ్ముందా!

– తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు



**పాలసముద్రం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలం నుండి తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా తాను ఇసుక అక్రమ రవా ణా చేస్తున్నానని నిరూపించే దమ్ము ఎవరికైనా వుందా! అని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యని ర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు సవాల్ విసిరారు. పాలసముద్రం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు షాడో ఎమ్మెల్యేగా వుండి అక్రమాలకు పాల్పడుతున్నట్లు కొందరు మాట్లాడుతున్నారని తాను ఎక్కడైనా అక్రమాలకు పాల్పడినట్లు రుజువు చేస్తే రాజకీయాల నుండి వైదొలుగుతానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్డీఎ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనప్పటికి ఇప్పటి వరకు మండల కార్యాలయాలకు వెళ్ళి పైరవీలు చేసింది లేదని ఈ విషయం ఏ అధికారిని అడిగినా చెప్తారన్నారు. జిడినెల్లూరు మండలంలో ఎమ్మెల్యే పేరు చెప్పుకుని కొందరు అక్రమ ఇసుక దందా చేస్తుంటే ఈ విషయంను తాను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళి కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పుకుని ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గత ఏడాది సెప్టెంబర్‌లోనే ఫిర్యాదు చేయడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ సుమెటోగా కేసు నమోదు చేశారన్నారు. ఈ మేరకు ఈ ఫిర్యాదుపై కలెక్టర్, ఎస్పీ, భూగర్భగనుల శాఖ ఎడి, పొల్యూషనల్ అధికారులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌కు ప్రస్తుతం నివేదిక ఇవ్వాల్సి వుందన్నారు. పాలసముద్రం మండలం నుండి ఇద్దరు రాష్ట్ర నాయకులు వున్నామని తాము ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణ చేసినట్లు రుజువు చేస్తే తాము రాజకీయాలకు గుడ్‌బై చెప్తామని స్పష్టం చేశారు. తాము ఎక్కడైనా అక్రమాలకు పాల్పడినట్లు రుజువులు వుంటే కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్ళి చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం యువత కార్యదర్శి, జిల్లా తెలుగుదేశం కార్యదర్శి వాసు, మండల తెలుగుదేశం బిసి సెల్ అధ్యక్షుడు దామురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**రామకుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త** రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెదెపా రాష్ట్ర నేతలు మునస్వామి, పత్ర నారాయణ కోరారు. శుక్రవారం కెంచనబల్లలో రైతులకు రాయితీతో ఉలవల పంపిణీ కార్యక్రమంను చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రైతులకు రాయితీతో బిందుసేద్యం పరికరాలు సైతం అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నేతలు మునిరెడ్డి, చంద్రారెడ్డి, సతీష్, గుణశేఖర్, శ్రీరాములు, వెంకటరమణ, బద్రీనాథ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మంత్రిచే పట్టువస్త్రసాల బహూకరణ

**కాణిపాకం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం వినాయకచవితి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. ప్రతి ఏటా ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ అని తెలిపారు. ఈమేరకు శనివారం ఉదయం 9 గంటల నుండి 10 గంటల మధ్య వినాయకచవితి సందర్భంగా మంత్రి రాంనారాయణరెడ్డి కాణిపాకం చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యేచే ఎ.గొల్లపల్లెలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

**తవణంపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** మండలంలోని ఎ.గొల్లపల్లెలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎ.గొల్లపల్లెలో శ్రీవిఘ్నేశ్వరాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా స్థానిక సర్పంచ్ సబిత ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్దిదారులకు మెరుగైన సేవలను అందిస్తామని తెలిపారు. అలాగే ప్రతి నెలా చిన్నారులకు, బాలింతలకు, గర్భవతులకు అందించే పౌష్టికాహారం క్రమపద్దతిలో అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈసందర్భంగా కేంద్రం ఆవరణంలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, తహశీల్దార్ సుధాకర్, నాయకులు దిలీప్, నల్లబోతుల ప్రవీణ్, సునీల్ చౌదరి, మోహన్‌నాయుడులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ



**కుప్పంరూరల్/గుడుపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త** ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ ఎరువుల వాడకం , భూసార పరీక్షల విధానాలపై కుప్పం మండలం ఉర్ల ఓబనపల్లి, గుడుపల్లె మండలం కనమనపల్లిలో వ్యవసాయ శాఖ ఎడిఎ నాగపద్మిని, ఏరువాక కేంద్రం శా స్రవేత్త సంధ్యారాణి రైతు లకు శిక్షణ కల్పించారు. ఈసందర్భంగా రైతులకు పంట యాజమాన్యం, అడవి పందుల దాడుల నివారణ తదితరులపై రైతులకు వివరించారు. ఈసందర్భంగా చేమంతి తోటను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఎఇఒ ఔరంగ్, ఆర్ఎస్‌కెమురుగనాయక్, నవీద్, శశికళ, రైతులు పాల్గొన్నారు.

## కొలమడుగులో సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమం



**శాంతిపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త** మండలంలోని కొలమడుగు పంచాయతీలో శుక్రవారం సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఎంపిడిఒ ప్రేమ్‌రాజ్‌కుమార్ ప్రారంభించారు. గ్రామంలో ముళ్ల పొదలు తొలగించడం, డ్రైనేజీల శుభ్రం, చెత్త చెదారాల తొలగింపుచేపట్టారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించుటకు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, డ్వాక్రా మహిళలు, ఉపాధికూలీలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కుప్పంలో వినాయక చవితి పండగ సందడి

కుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

సర్వవిఘ్నాలు తొలగించి ప్రథమ పూజలు అందుకునే బొజ్జ గణపయ్య పండగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు, యువత ఉత్సాహం చూపుతున్నారు. వినాయక చవితి పండగ సందడి కుప్పం నియోజకవర్గంలో శుక్రవారం జోరుగా కన్పించింది. కుప్పం పట్టణం ప్రధాన రహదారి జనంతో కిటకిటలాడింది. ఓ వైపు గణపయ్య విగ్రహాలు, పూజా సామగ్రి, పత్రి కొనుగోళ్లకు గ్రామీణ ప్రాంతాలనుంచి ప్రజలు భారీగానే హాజరయ్యారు. శనివారం పండగ నేపథ్యంలో పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో సందడి కన్పిస్తోంది. కుప్పం పట్టణంలో పలుచోట్ల

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మహిళలకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆర్థికసాయం



**చౌడేపల్లి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త** విద్యుత్‌షాక్‌కు గురైన అవస్థ పడుతున్న మహిళకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్థిక సాయాన్నందించినట్లు వైకాపా నాయకుడు పెద్దకొండామర్రి నాగభూషణరెడ్డి తెలిపారు. మండలంలోని కోటూరుకు చెందిన షాహీదా 4రోజుల క్రితం పొలం వద్ద విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలైంది. సర్పంచు జయసుధానాగభూషణరెడ్డి, ఎంపిటీసీ షాహీనాహుసేన్‌లు మాజీ మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా ఆయన నగదునందించారు. మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి బాధితురాలికందించాడు. వైకాపానాయకులురవికుమార్‌రెడ్డి, ఓబులేసు, మునిగిరిబాబురెడ్డి, పాల్గొన్నారు.

## పాతనేస్తాల అపూర్వ కలయిక

**చౌడేపల్లి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త** పాఠశాలలో విద్యనభ్యసించిన పాత నేస్తాలు అందరూ ఒక చోటు కలుసుకొన్నారు. మండలంలోని శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లి ఉన్నతపాఠశాలలో 2006–07కు చెందిన పూర్వపు విద్యార్థులకు పాఠశాల వేదికగా మారింది. విద్యనేర్పించిన గురువులను సమ్మేళనం చేసి వారందరినీ దుశ్శాలవాలతో ఘనంగా సన్మానించారు. పిల్లలకు క్రీడా పోటీలు నిర్వహించి వారికి విద్యావుపయోగకర వస్తువులందించారు. చదువుకొన్న పాఠశాలకు తమవంతుగా చేయాల్సిన పనులను చర్చించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసారు. ప్రధానోపాధ్యాయురాలు నాగవల్లి, ఉపాధ్యాయులు, 2006–07పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు కుప్పం మెపాచే 1.50లక్షల విరాళం



**కుప్పం,సెప్టెంబర్ 6 ప్రభాతవార్త** విజయవాడ నగరంలో వరద బాధితుల సహాయార్థం కుప్పం మున్సిపల్ పరిధిలోని 1115 మెప్మా సంఘాలు ఆదుకునేందుకు ముందుకు వచ్చాయి. శుక్రవారం మెప్మా తరపున వరద బాధితులకు రూ 1.50లక్షల విరాళాలను మెప్మా సిబ్బంది తరపున మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు చెక్కు రూపంలో అందించారు. విజయవాడ వరద బాధితులకోసం ప్రతి ఒక్కరూ సాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు తరపున పట్టువస్త్రాలు అందజేత



**కుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త** మండలంలోని చెక్కునత్తం పంచాయతీ దోలగట్టు గ్రామంలో నూతన వధూవరులకు సిఎం చంద్రబాబునాయుడు తరపున పట్టువస్త్రాలను తెదేపా నేతలు సమర్పించారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి చెక్కునత్తం మణి, వనసంరక్షణ సమితి ఛైర్మన్ కనకరాజు, నడిమూరు సర్పంచ్ జెకె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకోసం ముస్లింమైనార్టీలు విరాళాలు



**కుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త** విజయవాడ నగరంలో తలెత్తిన వరదల్లో చిక్కుకున్న బాధితుల సహాయార్థం జమాయత్ ఎ ఉలామా పిలుపు మేరకు శుక్రవారం నియోజకవర్గంలోని మసీదుల్లో మత గురువుల సూచనలతో ముస్లిం మైనార్టీలు విరాళాలను సేకరించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ముస్లిం సోదరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సాయాన్ని అందించారు. మొత్తం లక్ష రూపాయల మేరవిజయవాడ వరద బాధితుల సహాయార్థం పంపవున్నట్లు మత పెద్దలు, గురువులు తెలిపారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సత్కారం

కుప్పంరూరల్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న ఆవుల కేశవులును శుక్రవారం కుప్పంలో సహచర ఉపాధ్యాయులు, మిత్రులు, సిఆర్‌పిలు ఘనంగా సత్కరించారు. మండల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా కేశవులు అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్ర, హరి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**గూడూరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త** మట్టి వినాయకుడిని పూజించడం అంటే ప్రకృతిని ఆరాధించడమేనని ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు అన్నారు. గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన నాయకులు ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాల్లో ఒక్కటైన పర్యావరణ పరిరక్షణ చేయాలనే ఉద్దేశంతోనే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సూచనలతో మట్టి వినాయకుల ప్రతిమలు పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థి దశ నుండే పర్యావరణ పరిరక్షణ పై పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమల పై అవగాహన కల్పించి పర్యావరణ పరిరక్షణకు మన వంతు బాధ్యత నిర్వర్తించాలని, కులమతాలకతీతంగా అందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. జనసేన పార్టీ నాయకులు పిఠసి మోహన్, కార్యదర్శులు ఉప్పు సాయి కిరణ్, మట్టింపాటి సనత్, నాయకులు కార్తీక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజించాలని విద్యార్థుల ప్రదర్శన



**బాలాయపల్లి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త** శ్రీ వరసిద్ధి వినాయక ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు మట్టితో తయారు చేసిన గణనాథుని విగ్రహాలను పూజించాలని కరస్పాండెంట్ వై. శంకరమ్మ అవగాహన కల్పించారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలను వాడాలని, రసాయనాలు, ప్రమాదకరమైన రంగులు కలిపిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా ప్రమాదం పొంచి ఉంటుందని కరస్పాండెంట్ తెలిపారు. పాఠశాలలో ముందస్తు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. చిన్నారులు మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నినాదాలు ఇచ్చారు. చార్టుల ద్వారా పలు రకాల గణపతి ఆకృతులను ప్రదర్శించారు. పలువురు చిన్నారులు గణపతి శ్లోకాలను ఆలపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జయలక్ష్మి మాట్లాడుతూ మట్టితో తయారు చేసిన గణపతిని అందరూ పూజించే అవకగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి చిన్నారి మట్టితో తాము చేసిన వినాయకుని విగ్రహాలను ప్రదర్శించారు. అనంతరం గణేశుని వేషధారణలతో పలు రకాల ఆధ్యాత్మిక గణేశుని వేషధారణలతో పలు రకాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలతో చిన్నారులు సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష నేత సహాయం చేయకపోగా విమర్శలు చేయడం విడ్డూరం



**వెంకటగిరి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త** ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి తుఫాను సహాయక చర్యలు పై విమర్శలు చేయడం మానుకొని ఆయన కూడా బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జగన్మోహన్ రెడ్డి సిఎంగా ఉండగా విపత్తుల సంబంధించినప్పుడు హెలికాప్టర్‌లో తిరిగి వచ్చేవాడని తెలిపారు. ప్రజల కష్టాలను ఆయన పట్టించుకోనేది లేదని విమర్శించారు. సిఎం చంద్రబాబు నాయుడు రాత్రి పగలు తుఫాను సహాయక చర్యల్లో నిమగ్నమైనట్లు తెలిపారు. మూడు రోజుల్లో విజయవాడలో మామూలు స్థితికి ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. ఆయన వెంట మాజీ ఏఎంసి చైర్మన్ పి. రాజేశ్వర రావు, వెంకటగిరి, డక్కి మండల పార్టీ అధ్యక్షులు శ్రీరామదాసు గంగాధర్, చంద్రమౌళి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వర రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, నాయకులు సత్యనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను బాధితులకు లక్ష రూపాయిలు విరాళం అందజేసిన డాక్టర్లు

**వెంకటగిరి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త** విజయవాడ తుఫాను బాధితుల కోసం వెంకటగిరి డాక్టర్ అసోసియేషన్ వారు లక్ష రూపాయిలు విరాళాన్ని సిఎం సహాయనిధికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ద్వారా పంపారు. అలాగే విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు సుబ్రమణ్యం ఆయన తనయుడు శశి 25 వేల రూపాయిలను తుఫాను బాధితుల కోసం అందజేశారు. లక్ష రూపాయిలు నగదును సిఎం సహాయనిధి అకౌంట్‌కు ఫోన్ ద్వారా ట్రాన్స్ఫర్ చేశారు. తుఫాను బాధితులను దాతలు విరివిగా ఆదుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచారు. సిఎం చంద్రబాబు నాయుడు కూడా విరివిగా ఆదుకుంటున్నట్లు చెప్పారు. డాక్టరు శేషనాయుడు, సంజీవ రాయుడు మాట్లాడుతూ తుఫాను బాధితులు కోసం తమ వంతు సహాయం అందజేసినట్లు చెప్పారు. ఇంకా దాతలు ముందుకు రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మధుసూధన్ రావు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రాంబాబు



**వెంకటగిరి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త** వెంకటగిరి ఇన్చార్జి తహశీల్దార్‌గా రాంబాబు బాధ్యతలు చేపట్టారు. తహశీల్దార్‌గా ముని లక్ష్మి గత నెల 31వ తేదీ పదవి విరమణ చేయడంతో డిప్యూటీ తహశీల్దార్ రాంబాబుకు పూర్తి ఇంచార్జి తహశీల్దారుగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నియమించారు. మండలంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తారని తెలిపారు. తహశీల్దార్ రాంబాబును మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి, గుత్తికొండ బాబు లోకేష్ తదితరులు పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు.

## షాదీమంజిల్‌కు నూతన కమిటీ నియామకం



**కోట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త** కోటలోని షాదీమంజిల్‌కు నూతన కమిటీని ప్రభుత్వం నియమించిందని తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ తెలిపారు. ఆ మేరకు శుక్రవారం నూతన కమిటీ అధ్యక్షులుగా నాయబ్ రసూల్, కమిటీ సభ్యులుగా తెలుగుదేశం పార్టీ కోట పట్టణ అధ్యక్షులు షేక్ షంషుద్దిన్, బాబు, నౌషాద్, ఆసిఫ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సర్వోత్తమరెడ్డి, షాదీమంజిల్ కమిటీ అధ్యక్షుడు నాయబ్ రసూల్, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను కలిసి శాలువాతో సన్మానించారు.

## ప్రజల కష్టాలు వైసీపీ నాయకులకు పట్టవా

కోట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

వరదలతో అల్లాడుతున్న విజయవాడ ప్రాంత ప్రజలను ఆదుకునే పనిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తెలుగుదేశం నాయకులు, అధికారులు ఉంటే వైసీపీ నాయకులు విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని జిల్లా టిడిపి బిసిసెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు ఆరోపించారు. ఆయన కోటలో శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ వరదలు వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ వరద బాధితులను ఆదుకుంటూ అధికారులకు దిశదశ నిర్దేశం చేశారని చెప్పారు. అయితే మాజీమంత్రులు రోజా, బొత్స సత్యనారాయణలకు స్కాములు చేయడంలో ఉండే ఆసక్తి ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవడంలో ఉంటే బాగుండేదన్నారు. గతంలో చేసిన పనులు వల్లే విజయవాడ నగరం వరదలో చిక్కుకుందని ఆరోపించారు.

## సూళ్లూరుపేట ఎస్ఐ-2గా వేణుగోపాల్ నియామకం

***సూళ్లూరుపేట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త*** సూళ్లూరుపేట ఎస్ఐ–2గా మళ్ళి వేణుగోపాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వేణుగోపాల్ గతంలో శ్రీహరికోట, సూళ్లూరుపేట ప్రాంతాల్లో ఏఎస్ఐగా పనిచేసి ఉన్నారు. మరోఐదునెలల్లోఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్వగ్రామం తడ మండలం కాదలూరు

## చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి

తడ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



వినాయక చవితి పర్వదినాన్ని భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎస్ఐ కొండప్పనాయుడుతో కలిసి ఆయన శుక్రవారం గ్రామపెద్దలతో సమావేశం య్యారు. ఈసారి ప్రభుత్వం విధించిన నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని పోలీసులు తెలిపారు. గణేశ్ మండపాల ఏర్పాటు, డిజె భజంత్రీలు, ఊరేగింపులు వంటి వాటికి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. తడ, తడకండ్రిగ పంచాయతీల పరిధిలోని వివిధ గ్రామాల వారు పాల్గొన్నారు.

## కాదలూరు వద్ద ప్రైవేటు బస్సుకు రోడ్డు ప్రమాదం

– పలువురికి గాయాలు

తడ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

తడ మండలం కాదలూరు బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. తమిళనాడుకు చెందిన అన్నానగర్ నివాసి ఎన్.పురుషోత్తమన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఇంద్రాసిటీ ట్రావెల్ బస్సు కెప్టెన్‌గా పనిచేస్తున్నారు. ఈ బస్సుకు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోట దినేష్ డ్రైవర్‌గా ఉంటూ గురువారం చెన్నై నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. అయితే ఈ బస్సును అతివేగంగా నడపడం వల్ల ముందు వెళుతున్న లారీ ట్రాలీని ఓవర్ టేక్ చేయబోయి ప్రమాదానికి గురయింది. అదుపుతప్పి బ్రిడ్జి గోడకు ఢీకొని బస్సు డ్యామేజ్ అయిందని పురుషోత్తమన్ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో పలువురు బస్సు ప్రయాణికులు స్వల్ప గాయాలకు గురైనట్లు సమాచారం. అనంతరం మరో వాహనంలో వీరిని గమ్యస్థానాలకు తరలించారు. తడ ఎస్ఐ కొండప్పనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కుటుంబ గొడవలు, దాడి.. గాయాలు

తడ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

తడ మండలం అపాచి క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం ఉదయం జరిగిన దాడి కేసులో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు, కెవిబి పురం మండలం కాళంగికి చెందిన మద్రాసు నాగరాజు తన చెల్లెలు పార్వతిని ఇంటికి ఆటోలో తీసుకెళుతుండగా సూళ్లూరుపేట కోళ్లమిట్టలోని ఓంకార్ అనే వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పార్వతి భర్త ముత్తుతో పదిరోజుల క్రితం మనస్పర్ధలు రావడంతో తన స్నేహితురాలు అత్తిరాల కామాక్షి ఇంట్లో తలదాచుకుంది. అయితే చెల్లెలికి నచ్చజెప్పి ఇంటికి తీసుకెళ్లేందుకు శుక్రవారం కోళ్లమిట్టకు వెళ్లి ఆమెను తీసుకొస్తూ కామాక్షిని కొంత మందలించాడు. ఇది తెలుసుకున్న కామాక్షి భర్త అత్తిరాల ఓంకార్ ఆటోను వెంబడించి తన భార్యను ఎందుకు మందలిస్తావంటూ కీచైన్ చాకుతో నాగరాజు ఛాతీ కింద పొడిచాడు. రక్తగాయం కావడంతో చుట్టుపక్కల వారు జోక్యం చేసుకొని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తంతరలించారు. అక్కడే నాగరాజు పోలీసులకు ఈ మేరకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

## మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

కోట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

మట్టి వినాయక విగ్రహాల ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని యువ నాయకుడు కట్టరవి అన్నారు. శుక్రవారం కోట క్రాస్ రోడ్డులోని వినాయక చవితి సందర్భంగా ప్రజలకు మట్టి వినాయక ప్రతిమతలను పంపిణి చేశారు. మన సంప్రదాయం ఇంటా బయటా ఎంతో వేడుక గా నిర్వహించే గణేష్ ఉత్సవాల్లో పర్యావరణ హితాన్ని మరవకూడదని చెప్పారు. పర్యావరణానికి హాని చేయవన్నారు. నిమజ్జనం నీటిలో కలిసి పోతాయన్నారు. ప్రకృతి జీవరాసులతో మన బంధాన్ని పటిష్టం చేస్తాయన్నారు.

## పిఎండిఎస్ కిట్లు పంపిణి ...

దొరవారిసత్రం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త;

మండలంలోని పోలిరెడ్డిపాళెం రైతుసేవ కేంద్రం నందు పిఎండిఎస్ కిట్లును సూళ్ళూరుపేట వ్యవసాయశాఖ ఎడి అనిత చేతుల మీదుగా శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వ్యవసాయశాఖ ఎడి అనిత మాట్లాడుతూ పిఎండిఎస్ కిట్లులో జనుము, జీలుగలు, పిల్లిపెసరతోపాటు మరో ఆరు రకాల విత్తనాలు ఉన్నాయని తెలియజేశారు. ఒకే రకమైన పచ్చరొట్టి విత్తనాలు వాడడం కంటే ఈనవధాన్యాలు వాడితే పలురకాల పోషకాలు పంటకు అందుతాయని తెలిపారు. మండలంలోని తనయాలి, పోలిరెడ్డిపాళెం రైతుసేవ కేంద్రంలో పిఎండిఎస్ కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈకిట్లు 80శాతం సబ్సిడితో ప్రభుత్వం అందివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట దొరవారిసత్రం వ్యవసాయశాఖ అధికారి జ్యోతి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

## టిప్పర్లు అంబేద్కర్ నగర్‌లోని అండర్ బ్రిడ్జి వైపు వెళ్లేలా చర్యలు



**గూడూరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలో టిప్పర్లు అంబేద్కర్ నగర్‌లోని అండర్ బ్రిడ్జి వైపు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించామని, అలాగే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని అశోక్ నగర్, అంబేద్కర్ నగర్ వద్ద ఉన్న అండర్ బ్రిడ్జిలను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఆర్‌అండ్‌బి, పోలీస్ అధికారులు పరిశీలించారు. అలాగే కోర్టు సెంటర్ వద్ద ఇటీవల టిప్పర్ ఢీకొని కూలిపోయిన స్తంభాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో టిప్పర్లు అశోక్ నగర్ అండర్ బ్రిడ్జ్ వద్ద రాకపోకల సాగించడంతో నిరంతరం ట్రాఫిక్ సమస్య వస్తుందని టిప్పర్లు అంబేద్కర్ నగర్ అండర్ బ్రిడ్జి వైపు రాకపోకలు సాగించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించామని వెల్లడించారు. ఈ పరిశీలనలో పట్టణ సిఐ శేఖర్ బాబు, నాయకులు బిల్లు చెంచురామయ్య, రహీం, వెంకటేశ్వరరాజు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మపరిషత్ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్

గూడూరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త



శ్రీ విజయ దుర్గ పీఠాధిపతుల వారి సంకల్పంతో వారి ఆజ్ఞానుసారంగా శ్రీ విజయ దుర్గ పీఠం తరపున లక్ష రూపాయిలు చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పీఠం నుండి ప్రాతినిధ్యం వహించిన దుర్గా, రమ్య, కృష్ణవేణిలు అందజేశారు. వారితో పాటు హిందూ ధర్మ పరిషత్ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ కోట సునీల్ కుమార్ విజయవాడ పీఠ భక్తురాలు విజయ దుర్గ, హైదరాబాద్ వాస్తవ్యులు శుభ పాల్గొన్నారు. వెదురుపాక పీఠం నుండి 3500 మందికి సరపడా నిత్యవసర వస్తువులతో పాటు మంచినీళ్ల పాలప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, చిన్న పిల్లలకు పాల పొడి, చీరలు పంచలు చిన్నపిల్లలకు బట్టలు, ఎలక్ట్రాల్ పౌడర్ ఆ ప్రాంతంలోని అవసరార్థులకు సహకారంతో పై వస్తువులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మమ్మల్ని ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిన ఎంపి జేకే కుమార్, త్రినాథ్ జి, కిషోర్ రెడ్డి, వంశీకృష్ణ, వెంకటేష్, త్రిమూర్తులు, రాములతో పాటు మాతోపాటు ప్రయాణం చేసి అక్కడి అన్నార్థులందరికీ ఆహారాన్ని అందించిన సమరసత సేవా ఫ్యాండేషన్ కమిటీ సభ్యులు, గ్రామస్తులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

**తొట్టంబేడు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



మండలంలోని గుండేలిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తిరులమయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రీహిత కందాటి మునీశ్వర్‌రెడ్డి గణిత ఉపాధ్యాయులు మరియు పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు మల్లెల మస్తాన్‌రావు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఆయన సేవలను గుర్తించి పాఠశాలలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, భాస్కరయ్య, చెంచయ్య, జయసింహ, శ్రీకర్‌రెడ్డి, డిల్లీబాబు, మరియు ఎస్ఎంసి సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆంగ్ల ఉపాధ్యాయుడికి సత్కారం

**.శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో ఉన్న సరస్వతీ బాయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కె.వెంకటాద్రిని ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఉన్న కీ.శే.పిళ్ళారిదుర్గాప్రసాద్ వేదికపై నిర్వహించిన కార్యక్రమంలో వెంకటాద్రిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంలో వెంకటాద్రి ప్రత్యేక ప్రతిభ కనపరిచారని అందుకే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయఅవార్డుఅందుకున్నారన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

## గణపయ్య బొమ్మలకు భలే గిరాకి

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వినాయక చవితి సంబరాలు ఈ ఏడాది మిన్ను ముట్టుతున్నాయి. పోటీలు పడి యువకులు గ్రామాల్లో, పట్టణంలోని వీధి వీధిలో గణపతి విగ్రహాలను ఏర్పాటుకు సన్నాహాలు చేసుకున్నారు. అయితే ఈ ఏడాది వినాయక విగ్రహాల కొరత ఏర్పడింది. శ్రీకాళహస్తి పరిసరాల్లో వినాయక విగ్రహాలను ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ గుడారాలు వేసుకొని తయారు చేసి విక్రయించే వారు.ఇలా పట్టణ పొలిమేరల్లోని హౌసింగ్‌బోర్డు కాలనీ,మంగళం, అంజిమేడు, నెల్లూరుజిల్లాలోని పెళ్ళకూరు, నాయుడుపేటల్లో వీరు స్థావరాలు ఏర్పాటు చేసుకొని తయారు చేసి విక్రయించే వారు. అయితే గత రెండు సంవత్సరాలుగా వ్యాపారాల్లేక విగ్రహాలను వదలిపెట్టి వెళ్ళారు.దాంతో ఈ ఏడాది వ్యాపారాలు ఎలా ఉంటాయో ఏమో అని పరిమితంగా తయారు చేసారు.కానీ ఈ ఏడాది చవితిఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించుటకు నిర్ణయించుకోవటంతో డిమాండ్ పెరిగింది. దాంతో ముందుగా కొనుగోలు చేసిన వారు చేసుకోగా శుక్రవారం కొనుగోలు చేయటానికి వెళ్ళిన యువకులకు ధరలు చుక్కలు చూపించాయి. ఎక్కడా విగ్రహాల్లేదు. నాలుగు అడుగుల బొమ్మ గతంలో రూ.4వేలకు దొరికేది. అమ్ముకోలేక ఇబ్బంది పడే వ్యాపారులు ఈ సారి అదే నాలుగు అడుగుల బొమ్మను రూ.10వేలు ధర ఖరారు చేసారు. దాంతో యువకులకు దిమ్మదిరిగింది. యువకులు ఓ అంచనాలతో సొమ్ములు సిద్దం చేసుకున్నారు.కానీ బొమ్మల ధరలకు రెక్కలు రావటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. అంత ధర చెల్లించినా శ్రీకాళహస్తి చుట్టుపక్కల ఎక్కడా బొమ్మల్లేక పోవటంతో పలువురు అసంతృప్తికి గురయ్యారు. కొందరు యువకులు దూర ప్రాంతాల నుంచి విగ్రహాలను తెప్పించారు. అంతేకాక మట్టివిగ్రహాలు ఏర్పాటు చేయటం, పర్యావరణ పరిరక్షణకు నిర్వాహకులు ఎంతో సహకరిస్తున్నారు.

## తిరుపతి రాష్ట్ర కాపు నాడు సేవా సమితి కన్వీనర్గా చింతంశెట్టి మల్లికార్జున్

**తిరుపతి విద్య,సెప్టెంబర్ 6,ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవా సమితి తరుపున తిరుపతి నియోజకవర్గ బలిజ నాయకులు చింతంశెట్టి మల్లికార్జున్ గారిని తిరుపతి నియోజకవర్గ కన్వీనర్‌గా జాతీయ నాయకత్వం నియామకం చేయడం జరిగింది. ఈ నియామకం నేటి నుండి ఒక సంవత్సర కాలము మాత్రమే పనిచేయబడును అని నియమితులైన కాపు నాయకులు సంఘ అభివృద్ధికి కృషి చేస్తూ సంఘ నియమ నిబంధనలు అనుసరించి నడుచుకొనవలెను అని జాతీయ అధ్యక్షుడు మల్లెల శివ నాగేశ్వరరావు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే వాడాలి.ప్రిన్సిపాల్ నేతాజీ

**తిరుపతి విద్య,సెప్టెంబర్ 6,ప్రభాతవార్త:**

స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డు న్యూ బాలాజీ కాలనీలో ఉన్న భాష్యం బృహస్పతి క్యాంపస్ నందు జోనల్ ఇన్చార్జి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ నేతాజీ హాజరై మాట్లాడుతూ హైందవులకు అతి ముఖ్యమైన పర్వదినం వినాయకచవితి అని నేతాజీ తెలిపారు.ఏ కార్యక్రమం ప్రారంభించినా తొలి పూజ అందుకునే ఇలవేల్పు గణనాథుడే అని తెలిపారు.ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని వాడాలని ఇలా కాకుండా రసాయనాలతో తయారుచేసిన వినాయకుడిని వాడకూడదు అని దాని వలన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని విద్యార్థులకు తెలిపారు.అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ హెచ్ఎం లావణ్య,ఉపాధ్యాయులు,విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తిరుమలేశుని బ్రహ్మోత్సవాల

**బుక్‌లెట్ విడుదల**

**తిరుమల,సెప్టెంబర్ 6 ప్రభాతవార్తప్రతినిధి:**



శ్రీవేంకటేశ్వరస్వామికి తొమ్మిదిరోజులు పాటు జరిగే బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను శుక్రవారం టిటిడి అధికారులు విడుదల చేశారు. అక్టోబర్ 4వతేదీ నుండి 12వతేదీ వరకు అంగరంగవైభవంగా జరగనున్నాయి. అక్టోబర్ 3వతేదీ సాయంత్రం అంకురార్పణం, 4న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు జరగనున్నాయి. 8వతేదీ గరుడసేవ, 12న చక్రస్నానం ఉంటుంది.

## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల,సెప్టెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:**



శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పుంగనూరు రామచంద్రయాదవ్ దర్శించుకున్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 11న అనంతపద్మనాభవ్రతం

**-శాస్త్రోక్తంగా చక్రస్నానం**

**తిరుమల,సెప్టెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:**



కలియుగవైకుంఠంలో ఈనెల 11వతేదీ అనంతపద్మనాభవ్రతం వైభవంగా జరగనుంది. ఇందులో భాగంగా ఆరోజు ఉదయం 6గంటలకు శ్రీవారి సుదర్శనచక్రత్తాళ్వార్‌ను ఆలయం నుండి ఊరేగింపుగా స్వామివారి పుష్కరిణి వద్దకు తీసుకొస్తారు. అక్కడ అర్చకులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో స్నపనతిరుమంజనం అభిషేకం నిర్వహిస్తారు.

రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా

## నిత్యవసర సరుకులు పంపిణీ

**చిల్లకూరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త**



రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాజనేని శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలైన కృష్ణానగర్ సింగ్ నగర్, పరిసర ప్రాంతాలు అ ం య న ్ ట ం వ ం ట ి పాయకపురంకండ్రిగ గ్రామాల వరద ముప్పు ప్రాంతాలకు 10 కేజీల బియ్యం కేజీ కందిపప్పు రెండు కేజీల ఉప్మా రవ్వ, కేజీ మినపప్పు వంటి సోపులు, బట్టల సోప, దుప్పటి, బిస్కెట్‌ప్యాకెట్స్ టవల్స్ 2000 విలువ చేసే వంట సామాగ్రిని 1000 కుటుంబాలకు ఇంటింటికి పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు, సతీమణి ట్రస్ట్ కాపౌండర్ శిరీష,ట్రస్ట్ కార్యదర్శి రామానాయుడు , వైవి రావు, బాబు, శివాభి, మస్తాన్ అహ్మద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ హక్కుల పోరాట సమితి



**రేణిగుంట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** యాదవ్ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శిగాపూల వెంకటాద్రిని నియమిస్తూ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా పూల వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ జాతీయ కార్యదర్శి పదవి తన బాధ్యతను పెంచిందన్నారు. యాదవుల హక్కుల కోసంపోరాడతానన్నారు.యాదవులఅభివృద్ధిధ్యేయంగా పని చేస్తానని తెలిపారు.

## గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జూలియన్ రాజుకు ఘన సత్కారం



**రేణిగుంట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** రేణిగుంట ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం టీచర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ కళాశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పేద వద్యార్థుల సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజును ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సత్కారం తనకు బాధ్యతను పెంచిందన్నారు. తమ స్వీయ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ఇంకా ఎన్నో సేవలు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఇందరిఆదేవి, రంగనాథ్, మండలంలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన ఐడియాథాన్



**రేణిగుంట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం కరకంబాడి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సెప్టెంబరు 2వ తేదీ నుంచి జరుగుతున్న ఐడియా థాన్ శుక్రవారంతో ముగిసింది. విద్యా మంత్రిత్వ శాఖ నిర్దేశించిన విధంగా స్మార్ట్ ఇండియా హ్యక థాన్ నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగం నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. 65 బృందాలుగా ఎస్ఐహెచ్ సూచించిన థీమ్ అంశాలపై తమ ఆలోచనలను తెలియజేశారు. ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ ద్వారా పరిశీలించి 25 ఉత్తమమైన ఆలోచనలను ఎంపిక చేసింది. విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా వీటిని న్యూ ఢిల్లీకి పంపించారు. 2024 నవంబర్‌లో జరిగే స్థాయి పోటీల్లో పాల్గొని విధంగా వీరిని కళాశాల అధ్యాపకులు ప్రేరేపించడమే కాకుండా మార్గదర్శకం వహిస్తున్నారు. ముఖ్యంగా సాయిల్ అనాలసిస్ గుంతలను గుర్తించే వ్యవస్థ, ఏ వన్ పవర్ స్టూడెంట్ అసిస్టెంట్ చాట్ బ్యాట్, ఇరిగేషన్, స్మార్ట్ ఎడ్యుకేషన్‌అంశాలను ఐఐసీ కన్వీనర్ ప్రకటించినట్లు కళాశాల ప్రిన్సిపల్ నాధముందిరెడ్డి నాధముని తెలిపారు.

## భగత్‌సింగ్ కాలనీలో వినాయక విగ్రహాల పంపిణీ



**రేణిగుంట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** రేణిగుంట పట్టణం భగత్‌సింగ్ కాలనీలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం శుక్రవారం శ్రీ వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగామట్టి వినాయక విగ్రహాలనుపంపిణీచేస్తున్నట్లు తెలిపారు. డా. బాబు, సదాశివరెడ్డి, స్థానిక కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## 10న జాబ్‌మేళ

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలో ఈ నెల 10న జాబ్‌మేళ నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ లలిత తెలిపారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజి, సీడ్ ఆఫ్,డిఆర్‌డిఏలు సంయుక్తంగా శ్రీకాళహస్తిలో జాబ్‌మేళ నిర్వహించుటకు నిర్ణయించినట్లు లలిత తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందన్నారు.ఈ జాబ్‌మేళాలో బహుళ జాతీయ కంపెనీలైన డైకిన్‌ఎయిర్ కండిషనర్, కంపెనీ, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్,డిక్సన్ టెక్నాలజీస్,,కోల్మాన్ సర్వీసెస్, అపోలో ఫార్మసి, కోల్గేట్,అమెజాన్ వేర్ హౌస్ కంపెనీలు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదవతరగతి లేదా ఇంటర్,ఐటిఐ,డిప్లొమా, లేదా బిటెక్,ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన యువతీ యువకులు అర్హులని తెలియజేసారు.ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డులు జెరాక్స్ విద్యార్హతకు సంబంధించి సర్టిఫికేట్లు జెరాక్స్ బయోడేటా ఫామ్‌తో హాజరు కావాలని సూచించారు.

## బురదలో చంద్రబాబు తిప్పలు: విదేశాల్లో ప్రధాని సంబరాలు

**మాజీ మంత్రి చింతామోహన్**

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

ఆంధ్ర రాష్ట్రంలో వరదలతో జనం తల్లడిల్లుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బురదల్లో తిప్పలు పడుతున్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ విదేశీ పర్యటనల్లో సంబరంగా ఉన్నారని మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ విమర్శించారు. కేంద్రం వెంటనే కల్పించుకొని రాష్ట్రంలో విపత్తును ఎదుర్కొనుటకు కనీసం రూ.5వేలకోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేసారు. విజయవాడ అతలాకుతలం అవుతుంటే వారం రోజులుగా కేంద్ర ఒక్క పైసా కూడా సహాయం విదిలించలేదన్నారు.సమాజంలో నేడు నిరుద్యోగం రాజ్యమేలుతుంది.బిటెక్ చదువుకున్న విద్యార్థులు తిరుపతి జిల్లాలో కూలి పనులకు వెళుతున్నారు.తిరుపతి జిల్లాలో నిరుద్యోగ సమస్య విపరీతంగా ఉందన్నారు.కాంగ్రెస్ పాలనలో మన్నవరంలో భెల్ ఫ్యాక్టరీని మంజూరు చేసి కనీసం 6వేల మందికి ఉపాధి కల్పిస్తే బిజెపి పాలనలో ఆ ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసిందన్నారు.కేంద్రంలో బిజెపి పట్టించుకోలేదని రాష్ట్రాన్ని పరిపాలించిన వైకాపా ప్రభుత్వం కానీ స్థానిక శాసనసభ్యుడు నిర్లక్ష్యం చేసిందన్నారు.కాళహస్తి–నడికుడి రైల్వే లేన్ నిర్మాణాలు ప్రతి ఏడాది ప్రకటనలకే పరిమితమౌతుందన్నారు. నాడు దుగ్గరాజు పట్నం ఓడరేవు మంజూరు చేస్తే దాని అభివృద్ధి గాలికివదిలారన్నారు.కాంగ్రెస్ హయాంలో తిరుపతి జిల్లాకు మంజూరు చేసినప్రాజెక్టుల విషయంలో బిజెపిప్రభుత్వం కక్ష సాధింపుగా వ్యవహరిస్తుందన్నారు.ఈసమావేశంలో కాంగ్రెస్ నాయకుడు నరేంద్ర నాయుడు,రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ప్రతిమల పంపిణి

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ప్రతి ఏడాది ఉచితంగా అందించే వినాయక ప్రతిమల కార్యక్రమాలకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ముఖ్యఅతిదిగా హాజరయ్యారు.శుక్రవారం పట్టణంలోని లక్ష్మీకామాక్షి కళ్యాణ మండపంలో వినాయక ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు సురేంద్రకుమార్‌రెడ్డి ఉచిత వినాయక ప్రతిమల పంపిణిని ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు పార్టీలతో ప్రమేయం లేకుండా అతిధులు హాజరయ్యారు.సుమారు పాతికేళ్ళుగా సురేంద్రకుమార్‌రెడ్డి వందలాది వినాయక విగ్రహాలను అందిస్తూ గ్రామాల్లో వినాయక చవితి పండగనుప్రోత్సహిస్తున్నారు.యువత ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండగ వినాయక చవితి అన్నారు. శ్రీకాళహస్తిలో 500 చోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు.పంపిణి కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా నాయకులు హాజరయ్యారు.ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం,బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్,శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షుడు చెంచయ్యానాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్,పార్టీ కి చెందిన వాకచర్ల గుర్రప్పశెట్టి,కాసరం రమేష్, దండి రాఘవయ్య,పేట బాలాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్యను సత్కారం

**శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



మండలంలోని తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.కృష్ణయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, మరియు ఎంఎల్ఏ ఆరణిశ్రీనివాసులు చేతుల మీదుగా అందుకున్న విషయం విదితమే. ఈనేపధ్యంలో శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎన్నికైన కృష్ణయ్యకు ఉపాధ్యాయ బృందం మరియు పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ అచ్యుతయ్య, ఎస్‌బిఐ ఇండియా స్కిట్ బ్రాంచి మేనేజర్ పవన్‌కుమార్‌లు దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి మెమొంటోను అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునిరెడ్డి, వేణుగోపాల్, సుబ్బానాయుడుకండ్రిగ, చెంగల్రాయరెడ్డి, వెంకటాపురం, జనార్ధన్‌రెడ్డి, క్లస్టర్ రీసోర్స్ మొబైల్ టీచర్ ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక ప్రతిమలను శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో దాదాపుగా 910 మట్టి వినాయకులను శ్రీకాళహస్తి మండలంలోని రాజీవ్‌నగర్, కొండమిట్ట, ఏఎంపుత్తూరు, ఎన్టీఆర్ నగర్, ఇసుకదిబ్బ, శ్రీరాంనగర్ కాలనీ, బిపి అగ్రహారం కాలనీల్లో విగ్రహాలను అధ్యక్షుడు హేమకుమార్ ఆధ్వర్యంలో పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్రతి ఒక్కరు మట్టివినాయక విగ్రహాలను వాడాలని, ప్యాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వాడితే పర్యావరణానికి ముప్పవాటిల్లుతుందన్నారు. ప్రతి ఏడాది తమ సంస్థ తరపున విగ్రహాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నారాయణ అంజయ్య, శ్రీనివాసులు, చంద్రకాంత్, సురేష్, షరీఫ్, రాజశేఖర్, ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## పుస్తకాల నిర్వహణ కీలక పాత్రను పోషిస్తుంది

**ఏర్పేడు, సెప్టెంబర్ 6,ప్రభాతవార్త:** స్వయం సహాయక సంఘాల సభ్యులు పుస్తకాల నిర్వహణ



సక్రమంగా నిర్వహిస్తే ఆర్థిక లావాదేవీలు, ఆదాయం, వ్యయం లెక్కలు, లోన్లు చెల్లింపులు సరైన రికార్డులను ఎలా నిర్వహించాలి అనే అంశాలపై స్వయం సహాయక సంఘాల శిక్షకుడు సిసి శివయ్య వివరించారు. మండలంలోని యస్ఓఎస్ బాలల గ్రామం తిరుపతి కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 11 గ్రామాలకు చెందిన 112మంది స్వయం సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల నిర్వహణ సరైన విధంగా నిర్వహించడం వలన స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక పరంగా సుస్థిరత కలిగించడమే కాకుండా, వివిద బ్యాంకుల నుంచి ఆర్థిక వనరులను పొందడానికి కూడా ఎలా సహాయ పడుతుందో వివరించారు. స్వయం సహాయక సంఘాలు అంధించబడే అంతర్గత అప్పులు నిర్వహణలో కూడా సరైన పుస్తకాల నిర్వహణ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక యస్ఓఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమ ఇన్‌చార్జ్ వి సత్యనారాయణ, మునిరత్నం, యానిమేటర్లు మరియు సంరక్షకులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్త అకాల మరణం పార్టీకి తీరని లోటు

**ఏర్పేడు, సెప్టెంబరు6, ప్రభాతవార్త;** మండలంలోని మేర్లపాక గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీలో చురుకైన కార్యకర్త తిరుమలశెట్టి వెంకటరమణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈసందర్భంగా మృతుడి గ్రామంలో అతని ఇంటికి నియోజకవర్గం టిడిపి నాయకులు చేరుకొని మృతదేహంపై పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ మీకు అన్ని విధాల అండగా ఉంటుందని భరోస ఇచ్చిన రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, పార్టీ నాయకులు జగన్నాథనాయుడు,గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నరసింహుల్ నాయుడు, మునేంద్ర యాదవ్ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రికి జాతర కమిటీ ఆహ్వానం



**నగరి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** గంగజాతర ఉత్సవాలకు జాతర కమిటీ సభ్యులు శుక్రవారం మాజీ మంత్రి రోజాను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామదేవతల ఉత్సవాలకు చీర, సారెను మాజీ ఆలయ కమిటీకి అందించారు. ప్రతి ఏడాది జాతర సందర్భంగా గ్రామదేవతలు దేశమ్మ, ఓరుగుంటాలమ్మలను ప్రత్యేకంగా అలంకరించడం పరిపాటి. ఈ మేరకు అమ్మవారికి అలంకరణకు సంప్రదాయ బద్ధమైన పట్టుచీరలు, పసుపు, కుంకుమ, గాజులు, పసుపు దారాలు, పండ్లను తన స్వగృమం వద్ద ఆలయాల కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామ దేవతల చల్లని చూపులు నగరి ప్రజలకు సుఖసంతోషాలను అందించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను జాతర నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, దయానిధి, బీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, మదన శ్రీనివాసన్, కోలా బాలాజీ, రాజేష్, మున్సిపల్‌చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, వైస్ ఎంపీపీ కన్నియప్ప, వేణుబాబు, మురుగ, ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నగరి కమిషనర్‌గా కృష్ణారెడ్డి



**నగరి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** నగరి మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మున్సిపల్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. నగరి కమిషనర్‌గా ఉన్న మంజునాథ్ గౌడ్ బదిలీపై వెళ్లడంతో కడప జిల్లా కందుకూరులో ఎన్నికల విధుల నిమిత్తం కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన కృష్ణారెడ్డి నగరికి మున్సిపాలిటీకి విచ్చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ సంబంధిత అంశాల్లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

## నాయకులు సమన్వయంతో పని చేయాలి



**వడమాలపేట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** నాయకులందరూ సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి జరుగుతుందని, భవిష్యత్ బాగుంటుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. శుక్రవారం వడమాలపేటలోని టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా కృషి చేసినందునే వడమాలపేట మండలంలో అత్యధిక మెజారిటీ వచ్చిందన్నారు. నాయకులందరూ సంతోషంగా ఉండాలన్నదే తన దృఢ్ధమన్నారు. గ్రామాల్లో సమస్యల పట్ల స్పందిస్తూ ప్రజలకు, అధికారులకు మధ్య సంధాన కర్తలుగా నాయకులు వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. మండలం అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతానని, అభివృద్ధి పనుల కోసం అవసరమైతే ముఖ్యమంత్రితో మాట్లాడి అదనపు నిధులు తెస్తానని తెలిపారు. నాయకులు మణిరాజు, ధనంజయలునాయుడు, వెంకటయ్య, పెద్దబ్బరాజు, మునిరత్నం, హేమావతి, ఉమాపతిరావు, వెంకటేశ్వరరావు, రవినాయుడు, దేవా, భాస్కర్ నాయుడు, లోకరాజు, వేణు, శివశంకర్‌రాజు,మురళిఆచారి,శివరాయల్,శేఖర్‌నాయుడు, వెంకయ్య, వినోద్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఒక కుటుంబం ఒకే డోర్ నెంబరు



**వడమాలపేట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** ఒక కుటుంబంలోని సభ్యులందరూ ఒకే డోర్ నెంబరు, ఒకే సెక్షన్ పరిధిలోని ఉండాలని నగరి రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం వడమాలపేట మండలాల్లోని కదిరిమంగళం, తట్నేరి, ఎస్వీ పురం గ్రామాల్లో బీఎల్‌వోల నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ప్రతి ఇంటిని తప్పని సరిగా వెరిఫికేషన్ చేయాలని తెలిపారు. ఫారం 6,6బీ, 7,8 ఫారాలకు సంబంధించి పూర్తి వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఇంటింటి సర్వేలో గ్రామ స్థాయిలో పూర్తి బాధ్యత బీఎల్‌వోల దేనని, తప్పులు లేని జాబితా సిద్ధం చేయాలని సూచించారు. పరిశీలనలో తహసీల్దార్ జరీనా, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## టీడీపీ యాప్ టాప్ స్కోరర్లను అభినందించిన ఎమ్మెల్యే భానుప్రకాష్



**విజయపురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** మన టీడీపీ యాప్ ద్వారా పార్టీ కంటెంట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లి టాప్ స్కోర్‌లో నిలిచినందుకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తమ కార్యాలయం వద్ద సన్మానించి, గౌరవ మంత్రి నారా లోకేష్ పంపించిన ప్రశంసా పత్రాన్ని వారికి అందజేశారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను గుర్తించి పార్టీ నాయకులకు మరింత దగ్గర చేస్తోంది మన టీడీపీ యాప్ అని ఎమ్మెల్యే తెలిపారు.

## పర్యావరణాన్ని కాపాడుకోవాలి.

**తిరుపతి విద్య సెప్టెంబర్ 6 ,ప్రభాతవార్త:**



శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మనకు ఉన్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ భూమి నీరు పర్యావరణాన్ని కాపాడుకుంటేనే సుస్థిరమైనజీవితాలను ఆనందించడంతో పాటు భావితరాలకు మెరుగైన సహజ వనరులను అందించ గలమని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ తెలిపారు.కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సుస్థిరమైన జీవితానికి అనే అంశం పై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే తమకు అందుబాటులో ఉన్న సహజ వనరులను పర్యావరణాన్ని దుర్వినియోగ పరచకుండా తమ చుట్టూ ఉన్న ప్రజలలో చైతన్యం తీసుకొని రావాలని తద్వారా తమ చుట్టూ ఉన్న ప్రజలలో చైతన్యం తీసుకొని రావాలని తద్వారా ప్రతి ఒక్కరూ పర్యవరణాన్ని సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకుని భావితరాలకు అందించాలని కోరారు.పర్యావరణాన్ని కాపాడుకుంటామని వనరులను దుర్వినియోగ పరచమని ప్రతిజ్ఞ చేయించారు.ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ వి శైల.,డాక్టర్ పి శాంతి,డాక్టర్‌పి.గణేష్‌కుమార్‌డాక్టర్ బి.రమణమూర్తి,డాక్టర్ ఏ లావణ్య,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## ఘనంగా ఎస్ వి ఆర్ట్స్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**తిరుపతి విద్యా సెప్టెంబర్ 6,ప్రభాతవార్త:**



స్థానిక బాలాజీ కాలనీ ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఇన్చార్జి ప్రిన్సిపాల్ భాస్కరుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిత పాఠాలు నేర్పిన ఆదర్శ గురువులు మనకు స్ఫూర్తిదాయకం అని అన్నారు.ఎంతో లోతైన విషయాలపై మంచి విశ్లేషణతో పాఠాలు బోధించడం భారతదేశంలో గర్వించదగ్గ మేధివిగా అనేక విషయాలను అధ్యయనం చేయడం వల్ల వారి గొప్ప ఆచార్యులు అయ్యారని తెలిపారు.రాధాకృష్ణన్ తిరుపతికి సమీపంలో ని పుట్టి పెరిగారని భారత రాష్ట్రపతిగా పనిచేయడం వెనుక వారి ఉత్తమ ఉపాధ్యాయిత్వం గొప్ప ఆదర్శభావాలు ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ ప్రెసిడెంట్ భీమన్న,వైస్ ప్రెసిడెంట్ అన్నయ్య,కార్యదర్శి దయాన్,ట్రెజరర్ విజయశ్రీ అధ్యాపకుల విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ. కోటి విలువైన ఎర్రదుంగలు, కంటైనర్‌తో సహా స్వాధీనం



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

సుమారు కోటి రూపాయిలు విలువ కలిగిన ఎర్రచందనం దుంగలను కంటైనర్‌తో సహా టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఎస్పి ఎల్. సుబ్బరాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యచరణ అమలులో భాగంగా ఆర్ఎస్ఎఎస్‌టిఎఫ్ ఎస్పి పి. శ్రీనివాస్ పరివేక్షణలో ప్రత్యేక బృందాలు రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె. సురేష్ కుమార్ రెడ్డి రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ వి. విశ్వనాథ్, వారి సిబ్బందిని గురువారం మధ్యాహ్నం నుండి తిరుపతి జిల్లా, తడ మండలం పరిధిలోని చెన్నై – నెల్లూరు నేషనల్ హాస్పిటల్ ఎదురుగా వచ్చు పోవు వాహనాలను తనిఖీ చేస్తుండగా చెన్నై వైపు నుండి ఒక కారు, ఒక లారి వస్తూ పారిపోవడానికి ప్రయత్నించడంతో ఆర్ఐ, ఆర్ఎస్ఐ, వారి సిబ్బంది వెంబడించి 5 మంది వ్యక్తులను పట్టుకున్నారు. అనుమానంతో లారిని తాళము తెరిచి పరిశీలించగా అందులో ఒక ప్రైవేటు కంపెనీకి చెందిన వ్యవసాయ పరికరాలు బాక్సుల ముసుగులో సుమారు 143 ఎర్రచందన దుంగలు తరలిస్తున్నట్లు గుర్తించారు. ముద్దాయిలను విచారించగా చెన్నై నుండి కలకత్తాకు ఎర్రచందన దుంగలను అక్రమంగా తరలిస్తున్నట్లు తేలింది. ఈ కేసు వెనుక ఉన్న ఇతర స్మగ్లర్లను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

# 90రోజుల పాలనలో శ్రీకాళహస్తిని ప్రక్షాళన చేశాం

### -రాజీవ్‌నగర్‌లో అక్రమార్కులపై నిఘా ఎంఎల్‌ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

90రోజుల తెలుగుదేశంపార్టీ పాలనలో శ్రీకాళహస్తిని పూర్తిగా ప్రక్షాళన చేసామని ఎంఎల్ఏ బొజ్జలవెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పంచాయతీరాజ్ అతిధిగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడం వల్లనే ఇక్కడకు రాలేకపోయానని ఇకపై ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. పాత్రికేయమిత్రులతో రెండు,మూడు రోజుల్లో ముఖాముఖి సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.గత ఎంఎల్ఏ హయాంలో వార్తలు రాయాలంటే పాత్రికేయులు వెనుకంజవేసేవారని అయితే ఈప్రభుత్వంలో స్వేచ్ఛగా వార్తలు రాసుకోవచ్చున్నారు. పాత్రికేయులు కూడా రాసే వార్తలపై సమగ్ర సమాచారం సేకరించి రాయాలని అవసరమైతే తన వివరణ కూడా తీసుకోవచ్చున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతినెలా ఆదాయం వచ్చేలా చేశామని రూ.1.83లక్షలు ఆదాయం పెంచామన్నారు.అంతేకాకుండా బిసి, ఎస్‌సి,ఎస్‌టి వసతి గృహాల్లో మార్పు తీసుకువస్తున్నామని గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ అతిధిగృహం అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారిందని అయితే నేడు దీని రూపురేఖలు మార్చివేశామన్నారు. మురుగునీటి కాలువల్లో సిల్టు తొలగించేందుకు మంత్రి నారాలోకేష్ రూ.50లక్షలకు పైగా నిధులు మంజూరు చేశారని , అంతేకాకుండాకాలువలను సిల్టు తొలగిస్తున్నామన్నారు. ప్రతి మండలానికి రూ.2కోట్లు నిధులు మంజూరయ్యాయని ప్రతిచోట డ్రైనేజీలు, కొత్త డ్రైనేజీలు సిసి రోడ్లు వేయిస్తామన్నారు. అంతేకాకుండా మెగా కంపెనీ సారధ్యంలో మట్టితరలించి రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని వీటిని మెగా కంపెనీవారే బాగుచేసేలా చర్యలుతీసుకుంటామన్నారు. సిఎస్ఆర్ నిధుల కింద రూ.1.80కోట్లు నిధులు మంజూరయ్యాయని వివరించారు.

కబ్జాదారులు కబద్దార్..

కబ్జాదారులు జాగ్రత్తగా ఉండాలని లేకుంటే చర్యలు తప్పవని ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. రాజీవ్‌నగర్‌లో ప్రక్షాళన నిరంతరం జరుగుతుందని గత ప్రభుత్వ హయాంలో దొంటపట్టాలు ఇచ్చేందుకు ఓ అధికారి సంతకాలు ఫోర్జరీచేసి సీలువేసి ఇచ్చేశారని అన్ని విషయాలు తనకు తెలుసన్నారు. రాజీవ్‌నగర్ కాలనీలో ఒక్కొక్కరికి 40 నుంచి 50 పట్టాలు వరకు ఉన్నాయని ఇటీవల జరిగిన సర్వేలో కొందరు వాస్తవాలు తెలిపారని అయితే అధికారులను బెదిరించి పేర్లు రాయించుకున్నారన్నారు. ఒకరికి ఒక ప్లాట్లు మాత్రమే ఉండాలని ఎక్కువ ఉంటే కూల్చివేస్తాని స్పష్టం చేశారు. 2006-07లో ఉన్న పట్టాదారులు ఎవరైనా ఉంటే తహశీల్దార్‌ను కలవాలన్నారు.అక్రమాల్లో తహశీల్దార్‌లు, విఆర్‌ఓలు, మాజీ తహశీల్దార్‌లు ఎవరు ఉన్నా సరే జైలుకెళ్ళక తప్పదన్నారు. టిడ్కో ఇండ్లు విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

## వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే సునీల్‌కు చెక్కులు అందజేత

గూడూరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

విజయవాడ వరద భాధితుల సహాయార్థం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తోడుగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు చెక్కు రూపంలో దాతలు అందించారు. శుక్రవారం బాలాజీ లెమన్ మర్చంట్ అసోసియేషన్ ఆఫీసులో మేము సైతం అని సిఎంఆర్ఎఫ్ నిధికి గూడూరు మిర్చి వాపారస్థులు బిల్లు పెంచలయ్య, వల్లంకొండ వెంకటసుబ్బయ్య, బల్లి శ్రీహరి, వేముల శ్రీధర్ తదితరులు కలిసి 50 వేల రూపాయిలు, శ్రీబాలాజీ లెమన్ మార్కెట్ వ్యాపరస్థులు, 6వ వార్డు నాయకులు మునగపాటి సురేష్ 25 వేల రూపాయిలు చెక్కును, శ్రీ బాలాజీ లెమన్ మర్చెంట్ అధ్యక్షులు సిద్ధారెడ్డి, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు పెంచలయ్య, మార్కెట్ వారు అందరూ కలిసి 2 లక్షల రూపాయిలు చెక్కును, చిట్టమూరు మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ నాయుడు 1,50,000 రూపాయిలు ఆర్థిక సహాయ చెక్కును గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు అందజేసారు.

## వినాయక సాగర్‌లో నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు

### అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

వినాయక సాగర్‌లో నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నగర పాలక సంస్థ, పోలీసు, ఫైర్, ఇతర విభాగాల అధికారులతో కలిసి వినాయక సాగర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్యలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని చవితి వేడుకలను, నిమజ్జనంను విజయవంతం చేయాలన్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలు అన్ని క్రమపద్ధతితో వచ్చేలా చర్యలు చేపట్టాలని అన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో కొలను వద్ద గజ ఈతగాళ్లు జాగ్రత్తగా ఉండాలని, భక్తులు, ప్రజలు కొలను లోనికి వెళ్లకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి రామకృష్ణ ఆచారి, సిఐ రామ్ కిషోర్, డిఈ విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్‌సి మునికృష్ణ, గుండాల గోపి, ఆకుల సతీష్, ఆనంద్, తదితరులు ఉన్నారు.




## మట్టి వినాయక విగ్రహాలతో పూజలు

### - మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా విగ్రహాల పంపిణీ



చిత్తూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:

వినాయక చవితి పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ మట్టితో చేసిన వినాయక విగ్రహాలనే పూజించాలని మేయర్ అములు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో చిత్తూరు నగరపాలక సంస్థ జిజెఎం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గురజాల తండ్రి గురుజాల చెన్నకేశవులు నాయుడు, సోదరుడు జీవన్‌తో కలిసి మట్టితో చేసిన వినాయక విగ్రహాలను ఉచితంగా ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 2 వేల విగ్రహాలను వారు ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ ఎ.ప్రసాద్, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, సిఎంఎం గోపి, ఎఇలు లోకేష్, రజని, నగర పాలక సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**నిమజ్జనానికి కట్టమంచి చెరువు కట్టపై ఏర్పాట్లు పూర్తి**

చిత్తూరు నగర పరిధిలో వినాయక చవితి అనంతరం జరిగే వినాయక విగ్రహాల నిమజ్జనానికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కట్టమంచి చెరువు కట్ట వద్ద ఏర్పాట్లు పక్కాగా చేపట్టి పూర్తి చేసినట్లు అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్‌లు తెలిపారు. కట్టమంచి చెరువు కట్ట వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లను అధికారులతో కలిసి అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్‌లు పరిశీలించారు.




## రావి ఆకుపై వినాయకుని అద్భుత చిత్రం

చిల్లకూరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త



రేపే వినాయక చవితి.. ఊరు వాడ పండుగ వాతావరణం నెలకొంది. చిన్నా పెద్ద తేడా లేకుండా పండుగ ఏర్పాట్లలో మునిగిపోయారు. ఒకరికొకరు ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందంలో మునిగితేలుతున్నారు. సెలవులు హాయిగా గడుపుతున్నారు. ఈ క్రమంలో తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం పాలిచర్లవారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు దోనేపర్తి వెంకటరమణయ్య ప్రజలు, భక్తులకు వినాయక చవితి శుభాకాంక్షలు వినూత్నంగా తెలుపాలనుకున్నారు. బాగా ఆలోచించి వినాయకుని పూజకు ఉపయోగించే వివిధ రకాల ఆకులలో అతి ముఖ్యమైనదైన రావి ఆకుపై వినాయకుని చిత్రం గీయాలని నిర్ణయించుకున్నాడు. సుమారు 20 నిమిషాలు శ్రమించి విఘ్నేశ్వరుని చిత్రాన్ని అందంగా అబ్బురపరిచే రీతిలో చిత్రీకరించాడు. రావి ఆకు పై గీసిన ఈ చిత్రాన్ని అతని స్నేహితులు ఫోటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయ్యాయి. డ్రాయింగ్ ఉపాధ్యాయుని ప్రయత్నాన్ని సహచర ఉపాధ్యాయుని ప్రయత్నాన్ని సహచర ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బందితో పాటు పలువురు అభినందిస్తున్నారు. ప్రజలకు సృజనాత్మకంగా శుభాకాంక్షలు తెలపాలన్న ఆలోచనతో రావి ఆకు పై చిత్రాన్ని గీసినట్లు డ్రాయింగ్ ఉపాధ్యాయుడు వెంకటరమణయ్య పేర్కొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ.1.60 లక్షలు జరిమానా

చిత్తూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: మద్యం సేవించి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడిన వారిని కోర్టుకు హాజరు పరచగా జడ్జి ఒకొక్కరికి 10 వేల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు పేర్కొన్నారు. చిత్తూరు నగర పరిధిలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా 16 మంది ద్విచక్రవాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వీరిని కోర్టు ఎదుట హాజరు పరచగా ఒకక్కొరికి రూ.10 వేలు జరిమానా విధించడంతో 16 మంది నుండి రూ.1.60 లక్షలు జరిమానా వసూలు చేసినట్లు ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

## గణేష్ విగ్రహాలతో కోట ట్రాఫిక్

కోట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

గణేష్ విగ్రహాల తరలింపుతో కోటలో అడుగడుగునా ట్రాఫిక్ స్తంభించింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు వ్యాపార కేంద్రమైన కోటలో గణేష్ విగ్రహాలను పెద్దఎత్తున విక్రయాలు జరిపారు. దీంతో ప్రజలు కోటకు వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా గాంధీబొమ్మ సెంటర్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది.




